ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అనకాపల్లి
జిల్లా వార్తలు
సోమవారం 8 జూలై 2024

వైభవంగా జగన్నాథుని రథోత్సవం



రథంపై సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి

అనకాపల్లి పట్టణంలో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామి రథోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. గవరపాలెం అగ్గిమర్రి చెట్టు వద్ద గల జగన్నాథస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజల అనంతరం రథోత్సవాన్ని ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రారంభించారు. జై జగన్నాథ నామస్మరణతో పురవీధులు మార్మోగాయి.

- వార్త 5వ పేజీలో..



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

టన్ను ఇసుక రూ.1,225లు

రవాణా బాధ్యత వినియోగదారుడిదే

- ఆధార్ కార్డుపై ఓ వ్యక్తికి 20 టన్నులు సరఫరా
- నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వీ జయరాం



గబ్బాడ ఇసుక డిపో సిబ్బందితో ఆర్డీవో జయరాం సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

నర్సీపట్నం, జూలై 7: జిల్లాలోని నర్సీపట్నం మండలం గబ్బాడ, నక్కపల్లిలోని ఇసుక డిపోల్లో టన్ను ఇసుక ధర రూ.1,225లుగా నిర్ణయించినట్టు ఆర్డీవో హెచ్‌వీ జయరాం తెలిపారు. ఆదివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇసుక నిల్వ కేంద్రంలో విధులు నిర్వహించే సచివాలయం, రెవెన్యూ సిబ్బంది, పోలీసులతో ఆయన సమావేశం నిర్వహించారు. సోమవారం గబ్బాడ ఇసుక నిల్వ కేంద్రంలో ఇసుక విక్రయాలు మొదలుకానున్నాయని తెలిపారు. అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. జిల్లా ఇసుక కమిటీ ఇసుక ధరను టన్ను రూ.1,225లుగా నిర్ణయించిందని, రవాణా బాధ్యత వినియోగదారుడిదేనని తెలిపారు. ఇసుక కోసం వచ్చేటప్పుడు ఆధార్ కార్డు తప్పనిసరిగా తెచ్చుకోవాలని సూచించారు. ఒక వ్యక్తికి రోజుకి 20 టన్నులు ఇసుక మాత్రమే సరఫరా చేస్తామని తెలిపారు. గబ్బాడ ఇసుక నిల్వ కేంద్రంలో 48 వేల టన్నులు, నక్కపల్లిలో 28 వేల టన్నులు ఇసుక నిల్వలు ఉన్నాయని ఆయన చెప్పారు.

పింఛన్ల కోసం అడ్డదారులు

వైకల్యం లేకపోయినా కొందరు సదరం సర్టిఫికెట్లు సంపాదించినట్టు ఆరోపణలు

- గ్రామాల్లో ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతున్న దివ్యాంగ పింఛన్లు
- మండలంలో ఈ ఐదేళ్లలో 300కు పైగా పెరిగిన వైనం
- కూటమి ప్రభుత్వం పింఛన్ నగదు పెంచడంతో సదరం సర్టిఫికెట్ల కోసం అనర్హుల ప్రయత్నాలు
- అనర్హులను ఏరివేయాలని పలువురి డిమాండ్



చోడవరం, జూలై 7:

గ్రామాల్లో ఒకప్పుడు దివ్యాంగ పింఛను తీసుకోవాలంటే నామోషీగా ఫీలయ్యేవారు. కానీ గత కొంతకాలంగా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం దివ్యాంగుల కోటాలో పింఛన్లు తీసుకుంటున్న వారిని చూసి జనం ముక్కున వేలేసుకుంటున్న పరిస్థితి గ్రామాల్లో నెలకొంది.

మండలంలోని ఓ పంచాయతీలో 28 ఏళ్ల యువకుడు పల్సర్ బైక్ స్పీడుగా నడుపుతాడు. అందరితో కలిసి చక్కగా వాలీబాల్ ఆడతాడు. చూడడానికి అతనికి ఏ వైకల్యం కనిపించదు. కానీ అతనికి శరీరంలో మెడ భాగంలో ఓ ఎముక విరిగిపోయినట్టు డాక్టర్ సర్టిఫికెట్ తెచ్చుకుని దర్జాగా దివ్యాంగుల కోటాలో పింఛను పొందుతున్నాడు. మరో పంచాయతీలో ఓ పెద్ద మనిషి ఒడ్డూ పొడుగూ బాగానే ఉన్నప్పటికీ అతని చిటికెన వేలు కొద్దిగా వంకరగా ఉందని, అతనికి సదరం సర్టిఫికెట్ జారీ చేసేశారు. అతను కూడా దివ్యాంగుల కోటాలో దర్జాగా పింఛను తీసుకుంటున్నాడు. పలు గ్రామాల్లో వృద్ధులు, వితంతువుల కంటే ఈ దివ్యాంగుల పింఛన్లు ఎక్కువైపోవడం అధికారులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. అడ్డగోలుగా అనర్హులు పింఛన్లు పొందడం వల్ల అర్హులకు అన్యాయం జరుగుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పెరిగిపోతున్న దివ్యాంగ పింఛన్లు

మండలంలో అన్ని కేటగిరీలు కలుపుకుని మొత్తం పింఛన్లు 13,321 ఉన్నాయి. ఇందులో వృద్ధులు, వితంతువుల పింఛన్ల తరువాత స్థానంలో దివ్యాంగులే ఉన్నారు. వృద్ధాప్య పింఛన్లు 7,378 ఉంటే, వితంతు పింఛన్లు 3,348 ఉన్నాయి. ఆ తరువాత దివ్యాంగ పింఛన్లు 1,535 ఉన్నాయి. చోడవరం మండలంలో ఈ ఐదేళ్లలో దివ్యాంగ పింఛన్లు ఏకంగా 300కు పైగా పెరిగిపోయాయి. ఇదే సమయంలో ఇతర పింఛన్లు ఆ స్థాయిలో పెరగకపోవడం గమనార్హం. మేజర్ పంచాయతీల కంటే చిన్న పంచాయతీల్లోనే ఎక్కువ శాతం దివ్యాంగ పింఛన్లు ఉంటున్నాయంటే ఈ అడ్డగోలు సర్టిఫికెట్ల దందా ఏ స్థాయిలో సాగిందో అర్థం చేసుకోవచ్చు. మండలంలోని చోడవరం పంచాయతీలో 25 వేల మంది జనాభా ఉన్నారు. ఇక్కడ మొత్తం పింఛన్లు 1,687. ఇందులో దివ్యాంగ పింఛన్లు 328. మండలంలోని ఓ మోస్తరు పంచాయతీలైన చాకిపల్లి సచివాలయం పరిధిలో 411 పింఛన్లలో, దివ్యాంగ పింఛన్లు ఏకంగా 105కి పెరిగిపోయాయి. ఇక గవరవరం పంచాయతీలో 404 పింఛన్లకు గాను ... మిగతా 6వ పేజీలో

అనర్హులను ఏరివేయాలి



దివ్యాంగ పింఛన్లు పొందుతున్న అనర్హులను గుర్తించి ఏరివేత కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టాలి. దీని వల్ల అర్హులకు న్యాయం జరుగుతుంది. అర్హులకు పింఛన్ మంజూరులో ఆంక్షలు లేకుండా, వారి ఇంట్లో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నా సరే పింఛన్ ఇవ్వాలి.

- శరగడం నాగభూషణం, దివ్యాంగుల సంక్షేమ సంఘం మండలశాఖ అధ్యక్షుడు

గెడ్డలో మునిగి ఇద్దరి మృతి

- స్నానానికి దిగి మృత్యువాత



చందు, జ్ఞానేశ్వర్ మృతదేహాలు

మాడుగుల రూరల్, జూలై 7:

మండలంలోని తాటిపర్తి పంచాయతీ బిళ్లలపాలెం గ్రామ శివారులోని తాచేరు గెడ్డలో మునిగి ఆదివారం ఇద్దరు యువకులు మృతి చెందారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. తాటిపర్తికి చెందిన కురము చందు(25)కి విశాఖపట్నం ఆరిలోవకు చెందిన మేఘనతో గత నెలలో వివాహమైంది. అక్కడి జీవీఎంసీ పరిధిలో మలేరియా విభాగంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా చందు పనిచేస్తున్నాడు. ఆరిలోవలో నివాసముంటున్నారు. చందు స్వగ్రామమైన మాడుగుల మండలం తాటిపర్తికి భార్య మేఘన, ఆమె అన్న జ్ఞానేశ్వర్(22) వచ్చారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో తాటిపర్తి గ్రామానికి పక్కనే ఉన్న బిళ్లలపాలెం గ్రామం సమీపాన గల తాచేరు గెడ్డ వద్దకు వెళ్లారు. చందు, జ్ఞానేశ్వర్‌లు నీటిలో సరదాగా స్నానం చేసేందుకు దిగారు. అయితే అక్కడ లోతు ఎక్కువగా ఉండడంతో ఇద్దరికీ ఈత రాకపోవడంతో మునిగిపోయారు. ఈ సంఘటన చూసిన మేఘన విలపిస్తూ బిళ్లలపాలెం గ్రామస్థులకు చెప్పడంతో వారందరూ సంఘటన స్థలానికి వెళ్లి వారిద్దరిని బయటకు తీశారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న వారిని మాడుగుల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి అప్పటికే వారు మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుల కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

రహస్య సర్వేపై రగడ

జిల్లాలో హైడ్రో పవర్ ప్లాంట్ సర్వే కోసం అదానీ సంస్థ బృందాల సంచారం

- గుట్టు చప్పుడు కాకుండా వివరాల సేకరణ
- రెవెన్యూ, అటవీ శాఖల అనుమతులు లేకుండానే పనులు
- అడ్డుకుంటున్న గిరిజనులు
- తమ ప్రాంతాల్లో సర్వే చేస్తే సహించబోమని హెచ్చరిక



దేవరాపల్లి, అనంతగిరి మండలాల పరిధిలో సర్వే జరుగుతున్న పచ్చని కొండలు ఇవే

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

హైడ్రో పవర్ ప్లాంట్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం జిల్లాలో అదానీ గ్రూప్ సంస్థ పేరుతో కొందరు మళ్లీ రహస్య సర్వే చేపడుతున్నారు. దీని కోసం ప్రత్యేక సర్వే బృందాలను రంగంలోకి దింపారు. కనీసం స్థానిక రెవెన్యూ, అటవీ శాఖల అనుమతులు కూడా పొందకుండానే ఈ సర్వే బృందాలు అత్యంత రహస్యంగా వివరాలు సేకరిస్తుండడం వివాదాస్పదంగా మారింది. ఈ బృందాలను గిరిజనులు అడ్డుకుంటున్నారు. తమ ప్రాంతాల్లో సర్వే చేస్తే సహించేది లేదని హెచ్చరిస్తున్నారు.



సరియా గ్రామంలో సర్వేను అడ్డుకుంటున్న స్థానికులు (ఫైల్)

మాడుగుల నియోజకవర్గంలోని దేవరాపల్లి, అల్లూరి జిల్లాలోని అనంతగిరి సరిహద్దు గ్రామాల్లో సర్వే బృందాలు పనిచేస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో దేవరాపల్లి మండలం వాలాబు పంచాయతీ చింతలపూడి, నగరంపాలెం గ్రామాల్లో, అదే విధంగా అల్లూరి జిల్లా అనంతగిరి మండలం జీనబాడు పంచాయతీ సరియా, దాయర్తి గ్రామాల్లో అదానీ గ్రూపు సంస్థ పేరు చెబుతున్న రెండు సర్వే బృందాలు సంచరిస్తున్నాయి. కొండవాలు ప్రాంతాలైన సరియా, దాయర్తి పరిసరాల్లో నీటి వనరులున్న ప్రాంతాల్లో, చింతలపూడి, నగరంపాలెం ప్రాంతాల్లో హైడ్రో పవర్ ప్లాంట్ ప్రాజెక్టు ఏర్పాటుకు అవసరమైన భౌగోళిక స్థితిగతులను సర్వే బృందాలు సేకరించాయి. దేవరాపల్లి, అనంతగిరి మండలాల్లో రిజర్వు అటవీ ప్రాంతాల్లో ఈ ప్లాంట్ ఏర్పాటు కోసం సర్వే బృందాలు మట్టి నమూనాలను సేకరించి ఇప్పటికే పంపినట్టు సమాచారం. ఈ రెండు మండలాల్లో కోనాం, రైవాడ జలాశయాల పరిధిలో మట్టి నమూనాలు సేకరించడమే కాకుండా మరికొన్ని ప్రాంతాల్లో బృందాలు సర్వే జరిపేందుకు సన్నద్ధమవుతున్నాయి. జల వనరుల ఆధారంగా విద్యుదుత్పత్తి చేసే భారీ హైడ్రో పవర్ ప్లాంట్‌ను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయడం కోసం అదానీ గ్రూపు సంస్థల ప్రతినిధులు ఒక ప్రైవేటు సర్వే సంస్థ ద్వారా రహస్యంగా వివరాలు సేకరిస్తున్నట్టు తెలుస్తోంది. ఒక ప్రాంతంలో ఏదైనా ప్రభుత్వ లేదా ప్రైవేటు సంస్థలు సర్వేలు జరపాల్సి వస్తే కలెక్టర్, జేసీ స్థాయి అధికారుల నుంచి అనుమతులు విధిగా పొందాల్సి ఉంటుంది. ప్రభుత్వ శాఖల సహకారంతో ఆయా సంస్థలు సర్వేలు చేసుకొనే అవకాశం ఉంటుంది. అయితే అదానీ సంస్థ పేరుతో 2023 డిసెంబరు నెలలో ఈ ప్రాంతంలో సర్వే ప్రారంభించిన ప్రైవేటు సర్వే సంస్థ ఎటువంటి అనుమతులు పొందకుండానే సర్వే వ్యవహారాలు చక్కబెడుతోంది. గత ఏడాది స్థానికులు సర్వే చేయరాదని ... మిగతా 6వ పేజీలో

వైసీపీ ప్రభుత్వ హయాంలో సర్వే ప్రారంభం



దేవరాపల్లి, అనంతగిరి మండలాల్లో అదానీ సంస్థ కోసం రహస్య సర్వే జరుగుతోంది. చింతలపూడి వద్ద శారదా నదిపై, అదే విధంగా నగరం పాలెం సరియా వద్ద బొడ్డేరు గెడ్డపై హైడ్రో పవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం గత వైసీపీ ప్రభుత్వం సర్వే ప్రారంభించింది. ఈ ప్రాజెక్టు వల్ల ఈ ప్రాంతంలో రైతులు తీవ్రంగా నష్టపోతారు. పర్యావరణానికి విఘాతం కలుగుతుంది. రైవాడ, కోనాం జలాశయాల ఆయకట్టు రైతులు నష్టపోయే పరిస్థితులున్నాయి. గిరిజన ప్రాంతాల్లో సర్వేలు జరగాలన్నా, పవర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలన్నా పీసా చట్టం ప్రకారం గ్రామ సభల ద్వారా ముందుగా అనుమతులు పొందాల్సి ఉంటుంది. గిరిజన అటవీ హక్కుల చట్టం 1/70ను పరిగణనలోకి తీసుకొని మాత్రమే ప్రభుత్వాలు అనుమతులు ఇవ్వాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం సర్వేకు రహస్యంగా అనుమతి ఇవ్వడంతో ఇప్పుడు మళ్లీ సర్వే చేస్తున్నారు.

- డి.వెంకన్న, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు

హంతకుడి కోసం ముమ్మర గాలింపు

20కి పైగా ప్రత్యేక బృందాల ఏర్పాటు

- బాలిక హత్య కేసులో పోలీసుల ముమ్మర దర్యాప్తు
- బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్న హోం మంత్రి అనిత



నిందితుడు సురేశ్ (ఫైల్)

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం కొప్పుగొండు పాలెంలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను శనివారం దారుణంగా హత్య చేసిన నిందితుడు బోడ బత్తుల సురేశ్ (26) కోసం పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు అనకాపల్లి స్పెషల్ బ్రాంచి, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ పర్యవేక్షణలో 20కి పైగా బృందాలతో బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, సినిమా హాళ్లు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో పోలీసులు మఫ్టీలో గాలిస్తున్నారు.

.... వివరాలు మెయిన్‌లో

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



హోం మంత్రి అనితను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో అనకాపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

- వార్త 5వ పేజీలో..

సాగునీటి వనరులు గాడిన పడేనా?

ఐదేళ్ల వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యం

- గ్రోయిన్లు, కాలువలకు కనీసం మరమ్మతులు చేయని వైనం
- తీవ్రంగా నష్టపోయిన వరి రైతులు
- కూటమి ప్రభుత్వం రావడంతో చిగురించిన ఆశలు



శిథిలావస్థకు చేరిన ధారగెడ్డ మొదటి ఆనకట్ట

గొలుగొండ, జూలై 7:

మండలంలో గత ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన సాగునీటి వనరులు ఇప్పుడు కూటమి ప్రభుత్వం హయాంలో అభివృద్ధికి నోచుకుంటాయని రైతులు ఆశాభావంతో ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చెక్ డ్యామ్‌లు, పంట కాలువలు మరమ్మతులకు గురైనా పట్టించుకోలేదు. కేవలం ప్రతిపాదనలకే పరిమితం చేశారు. దీంతో సాగునీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014లో సాగునీటి సంఘాల ద్వారా చెరువుల్లో ఆక్రమణలను తొలగించి పటిష్ఠంగా గట్లు ఏర్పాటు చేశారు. పూడికలు తొలగించే కార్యక్రమం చేపట్టారు. సాగునీటి నిల్వలు పెరగడంతో కింది



మరమ్మతులు చేపట్టకపోవడంతో లీకవుతున్న సాగునీరు

పంట పొలాలకు సాగునీరు సమృద్ధిగా అందే విధంగా కృషి చేశారు. చెరువుల మదాలు, ఆనకట్టల గేట్లు ఏర్పాటు చేశారు. 2019లో వైసీపీ అధికారం చేపట్టాక సాగునీటి వనరులను నిర్లక్ష్యం చేసింది. దీంతో మండలంలోని సాగునీటికి రైతులు పాట్లు పడుతున్నారు. మండలంలో పాతవల్లంపేట గ్రామ పంచాయతీలో గల ధారగెడ్డ తొలి ఆనకట్ట ఎండాకాలంలోనూ నీరు ప్రవహిస్తూనే ఉంటుంది. అయితే ఈ ఆనకట్ట ఐదేళ్లుగా మరమ్మతులకు గురికావడంతో సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోలేదు. ఆనకట్ట కింద సుమారు వెయ్యి ఎకరాల సాగుభూమి ఉంది. ఖరీఫ్, రబీ సాగు చేపడుతుంటారు. నిత్యం గెడ్డలు ప్రవహించినప్పటికీ ఆనకట్ట మరమ్మతులకు గురికావడంతో పైనుంచి వచ్చే నీరు వచ్చినట్టే కిందకు పోవడంతో ఖరీఫ్ సాగులో పూర్తి స్థాయిలో సాగునీరు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు ... మిగతా 6వ పేజీలో

సాగునీటి వనరులపై దృష్టి పెట్టాలి



కూటమి ప్రభుత్వం రావడంతో సాగునీటి వనరుల అభివృద్ధిపై ఆశలు చిగురించాయి. వైసీపీ ప్రభుత్వంలో సాగునీటి వనరులకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఏటా సాగునీరు అందక వరి సాగు చేపట్టి తీవ్రంగా నష్టపోయాం. ఐదేళ్లుగా చెక్‌డ్యామ్‌లు శిథిలావస్థకు చేరినా పాలకులు, అధికారులు పట్టించుకోలేదు. ఈ ఏడాదైనా కనీసం ముందస్తుగా చెక్‌డ్యామ్‌లు, కాలువలకు మరమ్మతులు చేపట్టాలి.

- గాదె అప్పలనాయుడు, జోగంపేట, గొలుగొండ మండలం

క్రైం... crime news

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

పాయకరావుపేట రూరల్, జూలై 7 : మండలంలోని మంగవరం గ్రామంలో గల ఎస్సీ కాలనీలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఇందుకు సంబంధించి మృతురాలి తల్లి అజ్జమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామారావు తెలిపిన వివరాలివి. ఎస్.రాయవరం మండలం పెట్టుగొల్లపల్లి గ్రామానికి చెందిన దార్ల అజ్జమ్మ కూతురు కుమారికి పాయకరావుపేట మండలం మంగవరం గ్రామానికి చెందిన బడే నాగేశ్వరరావుతో పద్నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఆ సమయంలో రూ.60వేల కట్నంతో పాటు నాలుగు తులాల బంగారం, సారెను పుట్టింటివారు ఇచ్చారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. అయితే అదనపు కట్నం కోసం ఆమెను భర్త నాగేశ్వరరావు వేధిస్తూ మూడు నెలల క్రితం పుట్టింటికి పింపించేశాడు. పదిహేను రోజుల క్రితం తన కుమార్తెను మళ్లీ కాపురానికి పంపామని అజ్జమ్మ ఆ ఫిర్యాదులో పేర్కొంది. శనివారం రాత్రి 7.30 గంటల సమయంలో తన కుమార్తెకు ఫిట్స్ వచ్చి సీరియస్‌గా ఉన్నట్టు తన మనుమడు ఫోన్ చేయగా, బంధువులతో కలిసి మంగవరం వచ్చామని ఫిర్యాదులో ఆమె తెలిపింది. ఇంతలో తన కుమార్తె మృతదేహం ఇంటి బయట మంచంపై ఉందని, అలుడ్ని ప్రశ్నించగా ఉరి వేసుకుని చనిపోయిందని కోపంగా చెప్పాడని వివరించారు. తన కుమార్తె మృతిపై అనుమానం ఉందని ఆ ఫిర్యాదులో ఆమె తెలిపిందని ఎస్ఐ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు

నక్కపల్లి, జూలై 7 : మండలంలోని ఉద్దండపురం హైవే వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. తునికి చెందిన కుందూరు దుర్గా ప్రసాద్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం అడ్డరోడ్డు నుంచి ఆటోలో ఇద్దరు ప్రయాణికులను ఎక్కించుకుని పాయకరావుపేట వెళ్తుండగా, కారు సడన్ బ్రేక్ వేయడంతో ఆటో కారును ఢీకొంది. దీంతో దుర్గాప్రసాద్ గాయాలకు గురికాగా, స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

- బ్రిడ్జిపై ఉన్న రక్షణ గోడను బలంగా ఢీకొన్న లారీ
- ముందు భాగం నుజ్జు
- డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలు



బ్రిడ్జిపై రక్షణ గోడను ఢీకొన్న లారీ

సబ్బవరం, జూలై 7: మండలంలోని సూరెడ్డిపాలెం వద్ద అనకాపల్లి- ఆనందపురం జాతీయ రహదారిపై త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. పశ్చిమ బెంగాల్ నుంచి శని వారం బియ్యం లోడుతో కేరళకు లారీ బయల్దేరింది. ఆది వారం తెల్లవారుజామున సూరెడ్డి పాలెం వద్దకు వచ్చే సరికి డ్రైవర్ ఉజ్జల్ పగ్రే ఒక్కసారిగా నిద్రమత్తులోకి జారుకోవడంతో అక్కడి బ్రిడ్జిపై ఉన్న రక్షణ గోడపైకి వాహనం దూసుకుపోయి ఆగిపోయింది. అదృష్టవశాత్తు డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. లారీ ముందుభాగం నుజ్జయ్యింది. సమాచారం తెలుసుకున్న హైవే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎనిమిది కిలోల గంజాయితో మహిళ అరెస్టు

కూర్మన్నపాలెం, జూలై 7: గంజాయి రవాణా చేస్తున్న మహిళను దువ్వాడ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాలివి. అనకాపల్లి జిల్లా సబ్బవరం నుంచి దువ్వాడ రైల్వే స్టేషన్‌కు గంజాయి తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు దువ్వాడ నాగదేవత కొండ వద్ద మాటు వేసి పోలీసులు వాహనాల తనిఖీని చేపట్టారు. ఓ బస్సులో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు చెందిన కె.చిలకమ్మ అనే మహిళ దువ్వాడ రైల్వే స్టేషన్‌కు పాలిథిన్ బ్యాగుల్లో సుమారు ఎనిమిది కిలోల గంజాయి తరలిస్తున్నట్టు గుర్తించారు. ఈ మేరకు గంజాయిని స్వాధీనం చేసుకోవడంతోపాటు ఆమెను అరెస్టు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీలకు పాల్పడిన 69 మంది అరెస్ట్

రూ. 37. 12 లక్షల చోరీ సొత్తు స్వాధీనం : సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పలు చోరీలకు పాల్పడిన 69 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.37.12 లక్షల విలువైన సొత్తుని స్వాధీనం చేసుకున్నారు. ఆయా కేసుల్లో బాధితులకు రికవరీ సొత్తును అందజేసేందుకు పోలీస్ కమిషనరేట్‌లో ఆదివారం 'రికవరీ మేళా' ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సీపీ శంఖబ్రతబాగ్చి మాట్లాడుతూ నగరంలో గత నెలలో 99 చోరీ కేసులు నమోదయ్యాయన్నారు. ఆయా కేసుల్లో రూ.78.60 లక్షల విలువైన సొత్తు అపహరణకు గురైందన్నారు. వీటిలో 66 కేసులను చేధించామన్నారు. గతంలో జరిగిన చోరీలకు సంబంధించి మరో 14 కేసులను కూడా చేధించామన్నారు. మొత్తంగా 80 కేసులను చేధించామని తెలిపారు. వీటిలో దోపిడీ ఒకటి, పగటి దొంగతనాలు మూడు, రాత్రి పూట ఇళ్లలో చోరీలు, ఆటో, కారు చోరీలు, 16 సాధారణ చోరీలు, తొమ్మిది చైన్‌స్నాచింగ్‌లు, 24 మోటారుసైకిళ్లచోరీలు, ఏడు వైర్ల చోరీలు, జేబు దొంగతనం ఒకటి, మిగిలిన ఇతర చోరీలకు సంబంధించిన కేసులు ఉన్నాయని తెలిపారు. ఆయా నేరాలకు పాల్పడిన 69 మందిని అదుపులోకి తీసుకుని రూ. 37. 12 లక్షల విలువ చేసే 381.93 గ్రాముల బంగారం, 501.36 గ్రాములు వెండి, రూ.7.94 లక్షలు నగదు, 24 బైక్‌లు, ఒక ఆటో, కారుతో పాటు ఇతర విలువైన సొత్తు రికవరీ చేశామన్నారు. అదుపులోకి తీసుకున్న వారిలో 12 మంది మైనర్లు ఉన్నారన్నారు. చోరీ నియంత్రణలో భాగంగా నగరంలో రాత్రి పెట్రోలింగ్‌ను బలోపేతం చేశా మని, గత నెలలో 338 సీసీ కెమెరాలు కొత్తగా ఏర్పాటు చేశామని, చోరీల నియంత్రణకు 120 అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. నేరాలు జరిగే ప్రాంతాల్లో ప్రత్యేకంగా క్రైమ్ బీట్‌లు వేస్తున్నామన్నారు. 2022లో 820 చోరీలు నమోదు కాగా రూ.5.79 కోట్ల సొత్తు అపహరణకు గురైందన్నారు. వీటిలో 660 కేసులు చేధించి రూ.మూడు కోట్ల విలువైన సొత్తుని రికవరీ చేశామన్నారు. గత ఏడాది 678 చోరీకేసుల్లో రూ.5.29 కోట్లు సొత్తు అపహరణకు గురైతే, వాటిలో 482 కేసులు చేధించి రూ.3.36 కోట్లు విలువైన సొత్తు రికవరీ చేశామన్నారు. 2024లో ఇప్పటివరకూ 504 చోరీలు జరిగితే వీటిలో 333 కేసులను చేధించామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్ప, క్రైమ్ డీసీపీ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

కొప్పుగొండుపాలెంలో విషాద ఛాయలు

రాంబిల్లి, జూలై 7 : మండలంలోని కొప్పుగొండుపాలెంలో శనివారం జరిగిన బాలిక హత్య కేసు ఘటనపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. పరారీలో ఉన్న నిందితుడు సురేశ్‌ను త్వరితగతిన పట్టుకుని అరెస్టు చేయాలని హోం మంత్రి వంగలపూడి అనిత పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించిన నేపథ్యంలో సుమారు పన్నెండు ప్రత్యేక బృందాలు నిందితుడ్ని పట్టుకునే పనిలో ఉన్నాయని రాంబిల్లి సీఐ నర్సింగరావు తెలిపారు. కాగా, ఆదివారం సాయంత్రం పోస్టుమార్టం అనంతరం ఎన్టీఆర్ వైద్యాలయం నుంచి బాలిక మృతదేహాన్ని కొప్పుగొండుపాలెం గ్రామానికి తీసుకు వచ్చారు. మృతదేహాన్ని చూసి గ్రామస్థులంతా కన్నీరుమున్నీరుగా విలపించారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని అంతా కోరారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00


కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

ప్రగతి వెలుగులు

సింహాద్రి విద్యుత్ ప్లాంట్‌కు నేటితో 27 ఏళ్లు

- రెండు వేల మెగావాట్ల సామర్థ్యంతో సేవలు
- పర్యావరణ, భద్రత ప్రమాణాలు పాటించడంలో ఎన్నో అవార్డులు
- సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పరిమళాలు
- నేడు సింహాద్రి ఎన్టీపీసీ వ్యవస్థాపక దినం


సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)

సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ) ఆంధ్ర, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో వెలుగులను నింపుతూ మహారత్న కంపెనీగా ఎదిగింది. తొలి, మలి దశల్లో రెండువేల మెగావాట్ల విద్యుత్ సామర్థ్యాన్ని పూర్తి చేసుకుంది. నాణ్యమైన విద్యుత్తును ఉత్పత్తి చేస్తూ ప్రగతి పథంలో పయనిస్తోంది. ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతోంది.


ప్లాంట్ లోపల ఉన్న టర్బైనర్

పరవాడ, జూలై 7 : ఉమ్మడి విశాఖ జిల్లా పరవాడలో 1997లో అప్పటి ఎన్డీఏ ప్రభుత్వం సింహాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంటును ఏర్పాటు చేసింది. ఇందుకు రూ.3,700 కోట్లు కేటాయించింది. దీనిని ఏర్పాటుకు రైతుల నుంచి 3,400 ఎకరాల స్థలాన్ని సేకరించింది. నిర్మాణం పూర్తి చేసుకొని వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని 2007లో శ్రీకారం చుట్టింది. మలి విడతగా మరో వెయ్యి మెగావాట్ల కేంద్రాన్ని స్థాపించి రెండు వేల మెగావాట్ల సామర్థ్యానికి చేరుకుంది. ఎన్టీపీసీ ఏర్పాటై సోమవారానికి 27 ఏళ్లు పూర్తి చేసుకుంది. సింహాద్రి ఎన్టీపీసీలో విద్యుదుత్పత్తికి అవసరమైన బొగ్గును ఒడిశా, సింగరేణి, ఇండోనేషియా నుంచి దిగుమతి చేసుకొంటున్నారు. రెండు వేల మెగావాట్ల విద్యుదుత్పత్తికి గాను 30వేల మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరమవుతుంది. విద్యుదుత్పాదనకు అవసరమైన నీటిని ఏలేరు కాలువ, తిక్కవానిపాలెం సముద్రం నుంచి పైపులైన్ల ద్వారా తీసుకొని వినియోగిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, భద్రత ప్రమాణాలు పాటించడంలో విశేష కృషి చేస్తున్న సింహాద్రి ఎన్టీపీసీకి పలు అవార్డులు లభించాయి. అలాగే, సామాజిక బాధ్యతలో భాగంగా సింహాద్రి ఎన్టీపీసీ గ్రామీణాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నది. సంస్థ సీఎస్ఆర్ నిధుల నుంచి 2019-24 ఏళ్లలో నిర్వాసిత గ్రామాల అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు వెచ్చించింది.

తిక్కవానిపాలెం తీరంలో అతి పెద్ద జెట్టీ

సంస్థలో విద్యుదుత్పానకు అవసరమైన సముద్రపు నీటిని ఉపయోగించుకోవడానికి తిక్కవానిపాలెం తీరంలో ఏడు వందల మీటర్ల లోపల నిర్మించిన జెట్టీ దేశంలోనే అతి పెద్దదిగా పేర్కొనవచ్చు. ప్లాంటులో 275 మీటర్ల ఎత్తులో నిర్మించిన రెండు చిమ్నీలు ఆసియా ఖండంలోనే అతి పెద్దవిగా చెప్పవచ్చు. ఇలాగే 15 మీటర్ల ఎత్తులో నిర్మించిన నాలుగు కూలింగ్ టవర్లు దేశంలోనే పెద్దవి. అలాగే, సింహాద్రి రిజర్వాయర్‌పై 25 మెగావాట్ల సామర్థ్యం గల నీటిపై తేలియాడే (ఫ్లోటింగ్) సౌర విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి



సింహాద్రి ఎన్టీపీసీ ప్రగతి పథంలో పయనిస్తూ మంచి పనితీరును కనబరుస్తోంది. ఇది ఉద్యోగులు, కార్మికులు, పరిసర గ్రామాల ప్రజల సమిష్టి కృషితోనే సాధ్యమైంది. ఇప్పటికే సీఎస్ఆర్ భాగంగా నిర్వాసిత పరిసర గ్రామాల్లో రూ. కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు, సేవా కార్యక్రమాలు చేపట్టాం. మున్ముందు మరిన్ని నిధులు కేటాయిస్తాం. పర్యావరణ పరిరక్షణ నిమిత్తం 10 లక్షల మొక్కలు నాటాం. యాష్ పాండు వద్ద కాలుష్య నివారణకు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాం.

- సంజయ్‌కుమార్ సిన్హా, సీజీఎం, సింహాద్రి ఎన్టీపీసీ

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

- గత ప్రభుత్వంలో పెట్టిన కేసులు తొలగించేందుకు న్యాయ నిపుణుల సలహాతో చర్యలు
- హోం మంత్రి వంగలపూడి అనిత వెల్లడి
- పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి ఘన సత్కారం


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినిని సత్కరిస్తున్న మంత్రి అనిత, చిత్రంలో ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల తదితరులు

అనకాపల్లి టౌన్, జూలై 7: టీచర్ అనే పదంలో తెలియని శక్తి ఉందని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఇక్కడి నూకాంబిక ఆలయ సమీపంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ప్రతిభకు పట్టాభిషేకం పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన జిల్లాలోని 80 మంది విద్యార్థినీ విద్యార్థులను, పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించిన 37 మంది పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఈ సందర్భంగా సత్కరించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి అనిత మాట్లాడుతూ మహోన్నతమైనది ఉపాధ్యాయ వృత్తి అన్నారు. గత ఐదేళ్లగా టీచర్లు పోరాటం చేశారని, వారి పోరాటంలో న్యాయం ఉందన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు చెప్పనీయకుండా నాడు- నేడు పనుల్లో కంకర, సిమెంట్, టాయిలెట్ ఫొటోలు తీయమంటే ఉత్తమ ఫలితాలు ఎలా వస్తాయని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రంలో ట్రిపుల్ ఇంజన్ ప్రభుత్వం ఉందన్నారు. గత ప్రభుత్వం తనపై కూడా 23 కేసులు పెట్టిందని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేపట్టిన ఉపాధ్యాయులపై కూడా కేసులు నమోదు చేసిందని, వీటిని తొలగించేందుకు న్యాయ నిపుణుల సలహాతో చర్యలు తీసుకుంటామని వివరించారు. ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఉపాధ్యాయులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందన్నారు. వారిని ఎన్నికల విధుల్లో ఉండనీయకుండా ప్రయత్నం చేసిందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలను తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. పది ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను బహూకరిస్తామని ప్రకటించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ సమూలంగా నాశనమైందన్నారు. దీనివలన ఉపాధ్యాయులు, విద్యార్థులు గందరగోళంలో పడే పరిస్థితి నెలకొందన్నారు. మంచి ప్రభుత్వం అధికారంలో ఉందని, రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. అనంతరం మంత్రి అనితను యూనియన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. పీఆర్‌టీయూ జిల్లా కన్వీనర్ డి.గోపీనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీలు బుద్ద నాగజగదీశ్వరరావు, గాదె శ్రీనివాసులునాయుడు, డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, డిప్యూటీ డీఈవో పి.అప్పారావు, టీడీపీ నాయకులు బత్తుల తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు, పీఆర్‌టీయూ ప్రతినిధులు బుద్ద కాశీ, ఎం.శ్రీను, పెద్దినాయుడు, ఎం.నాగేశ్వరరావు, కె.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను గోపినాథ్ మంత్రికి వివరించారు.

ప్రతి మండలంలో ఐదు వేల మందికి ఉపాధి

- ప్రగల్భాలు పలికిన 'బూడి' బాగోతాలు బయట పెడతా
- ప్రజల ముందు దోషిగా నిలబెడతా : అనకాపల్లి ఎంపీ రమేశ్


దేవరాపల్లి సభలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్, చిత్రంలో ఎమ్మెల్యే బండారు

దేవరాపల్లి, జూలై 7 : ప్రతి మండలం నుంచి ఐదు వేలమంది నిరుద్యోగులకు పరిశ్రమల ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్టు అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తెలిపారు. స్థానిక రైవాడ అతిథి గృహం వద్ద విజయోత్సవ సభ నిర్వహించారు. తొలుత మండల నాయకులంతా లలితా థియేటర్ వరకు వెళ్లి ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో ఎంపీ రమేశ్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పరిశ్రమలు లేక నిరుద్యోగ సమస్య నెలకొందన్నారు. అందుకే ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటుకు అవకాశం కల్పించి ఉపాధి కల్పించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. సృజల స్రవంతి ద్వారా సాగునీరు అందించి రైతులు, యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. తనపై పోటీ చేసిన మాజీ ఉపముఖ్యమంత్రి బూడిముత్యాలనాయుడు తనను వచ్చిన దారిన చాప చుట్టి పంపుతానని ప్రగాల్భాలు పలికి ఎక్కడ ఉన్నారన్నారు. అన్యాయంగా, అక్రమంగా దోచుకున్న అక్రమ ఆస్తులను బయట పెట్టడమే కాకుండా, చేసిన తప్పులన్నీ ప్రజల ముందు ఒప్పుకొనే విధంగా దోషిలా నిలబెడతానన్నారు. ప్రజలను పెట్టిన ఇబ్బందులు వడ్డీతో తీర్చే విధంగా చేస్తానన్నారు. ఈ సందర్భంగా గజమాలతో ఎంపీని సత్కరించారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు రైవాడ ఆధునీకరణ పనులు పూర్తి చేయాలని రైతులకు కోల్డ్ స్టోరేజీ, డిగ్రీ కళాశాల మంజూరుకు కృషి చేయాలని నాయకుల దృష్టికి తీసుకు వెళ్లారు. దేవరాపల్లి మండలంలోని సమస్యలను మండల పార్టీ అధ్యక్షుడు సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ప్రస్తావించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీజీ కుమార్, బీజేపీ రాష్ట్ర నాయకులు సురేంద్రకుమార్, బండారు అప్పలనాయుడు, జనసేన నాయకులు గొర్రుపోటు రామ్మూర్తినాయుడు, చెరకాన సూర్యనారాయణ, పాత్రునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: ఈ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పకు కృషి చేస్తానని ఎంపీ సీఎం రమేష్ అన్నారు. కె.కోటపాడులో కూటమి ఆధ్వర్యంలో అభినందన సభ ఆదివారం ఏర్పాటు చేశారు. తొలుత చౌడువాడ నుంచి తొమ్మిది కిలోమీటర్ల మేర కూటమి శ్రేణులు సీఎం రమేష్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిలను భారీ ఊరేగింపు చేపట్టి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపీ రమేశ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంతో కొత్త పరిశ్రమలు రాలేదు సరికదా ఉన్నవి వేరే రాష్ట్రాలకు తరలిపో యేలా వికృత పాలన చేపట్టిందన్నారు. పరిశ్రమలు లేకపోవడంతో ఎంతో మంది యువత ఉద్యోగ, ఉపాధి లేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ జిల్లాలోనే మాడుగుల నియోజకవర్గం ఎంతో వెను కబడి ఉందని ఎటువంటి ఆర్థిక వనరులు లేవన్నారు. పినగాడి నుంచి దేవరాపల్లి వరకు నాలుగు లైన్ల రహదారి ఏర్పాటు చేయాలని ఎంపీని కోరారు. అలాగే వ్యవసాయధారిత పరిశ్రమలు నెలకొల్పి ఇక్కడున్న యువతకు ఉపాధి కల్పించాలన్నారు. రైతులకు ప్రయోజనం కలిగేలా చూడాలన్నారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, సీనియర్ నాయకులు పీవీజీ కుమార్, మాజీ వీసీ ముర్రు ముత్యాల నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేష్, కూటమి నేతలు బాలిబోయిన సంతోష్, కొటాన ఈశ్వరరావు, చల్లా సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న కొండపై త్వరలో శంఖు, చక్ర, తిరు నామాల ఏర్పాటు



సింహాచలం, జూలై 7 : వరాహలక్ష్మీనృసింహస్వామి కొలువుదీరిన సింహగిరిపై ఈశాన్య పర్వతం వైపు గతంలో మాదిరి శంఖు, చక్ర, తిరు నామాలు ఏర్పాటు చేయడానికి దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి చొరవతో సన్నాహాలు పూర్తి చేశారు.2014లో హుద్‌హుద్ తుఫాన్ ధాటికి సింహగిరిపై ఏర్పాటు చేసిన శంఖు, చక్ర, తిరునామాలు పడిపోయాయి. నాటి నుంచి వాటిని పునరుద్ధరించడంలో అధికారులు విఫలమయ్యారు. తాజాగా జీఆర్‌టీ జ్యూవెలర్స్ సంస్థ ముందుకు వచ్చి రూ. 85 లక్షలు వెచ్చించి వాటి పనులను చేపట్టింది. ఇవి దాదాపు పూర్తి కావొచ్చాయి. సింహగిరి ప్రదక్షిణలోపు వాటిని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించనున్నట్టు ఈవో తెలిపారు. ఇదిలావుంటే స్వామికి నాలుగో విడత చందన సమర్పణ ఈనెల 21న జరగనుంది. ఆషాడమాస శుక్లపక్ష దశమి అనగా ఈనెల 16న చందనం అరగదీతను ప్రారంభించేందుకు ఆలయ బేడా మండపంలో ప్రత్యేక సానరాళ్లను శుభ్రం చేసి సిద్ధం చేస్తున్నారు.


జగన్నాథుని రథాన్ని లాగుతున్న భక్తులు

అంగరంగ వైభవంగా జగన్నాథస్వామి రథోత్సవం

- వేడుకలను ప్రారంభించిన ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల
- దారి పొడవునా దర్శించుకున్న భక్తులు
- అనంతరం ఇంద్రజ్యుమ్న హాల్ వద్ద కొలువుదీర్చిన అర్చకులు


వేడుకల్లో ఆకట్టుకున్న పులివేషాలు

అనకాపల్లి టౌన్, జూలై 7: సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి రథోత్సవం అనకాపల్లి పట్టణంలో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. గవరపాలెం అగ్గిమర్రి చెట్టు వద్ద గల ఆలయంలో అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ తొలుత ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఎంపీ సీఎం రమేష్ దంపతులు రథం వద్దకు తీసుకువచ్చి అధిష్ఠించారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం ఎంపీ రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ రథోత్సవాన్ని ప్రారంభించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ వేడుకల్లో భాగంగా దారి పొడవునా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. గవరపాలెంలో రథయాత్ర పూర్తయిన తరువాత చిననాలుగు రోడ్ల జంక్షన్ నుంచి స్టేషన్ రోడ్డు మీదుగా గూడ్స్‌షెడ్డు వద్ద గల ఇంద్రజ్యుమ్న హాల్‌కు రాత్రికి చేరుకుంది. అర్చకులు ఉత్సవమూర్తులను అక్కడ అధిష్ఠించి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ జి.శంకరరావు, ట్రాఫిక్ సీఐ పి.పైడపునాయుడు ఆధ్వర్యంలో భారీ ఎత్తున పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి, ఆలయ ఈవో రాజసులోచన, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, మళ్ల సురేంద్ర, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విశాఖపట్నంలోని టౌన్ కొత్త రోడ్డులో జగన్నాథస్వామి తొలి రథ యాత్ర ఆదివారం నేత్రపర్వంగా సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. - విశాఖపట్నం

సరికొత్త ఫీచర్లతో ఈపీడీసీఎల్ మొబైల్ యాప్

- ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీ డీసీఎల్) ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్‌ను సరికొత్త ఫీచర్లతో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రక టన విడుదల చేశారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని విని యోగదారుడి 16 అంకెల సర్వీసు నెంబరు నమోదు చేసుకోవడం ద్వారా యాప్ సేవలను పొందవచ్చన్నారు. యాప్‌లో బిల్ పే ఆప్షన్ ద్వారా విద్యుత్ బిల్లులను ఎటువంటి అదనపు రుసుం లేకుండా అత్యంత సుల భతరంగా చెల్లించవచ్చని వివరించారు. వినియోగ దారుడి సర్వీసుకు సంబంధించిన విద్యుత్ వినియోగం, బిల్లు వివరాలు, చెల్లింపు, సరఫరా పరిస్థితి తదితర వివరాలను కూడా తెలుసుకోవచ్చన్నారు. షై యూసెజ్ ఆప్షన్ ద్వారా విద్యుత్ మీటర్‌లో ఉన్న రీడింగ్ ప్రకారం కేవలం వినియోగపు యూనిట్లను సంఖ్యను నమోదు చేయడం ద్వారా విద్యుత్ బిల్లును వినియోగదారులే యాప్ ద్వారా లెక్కించుకోవచ్చన్నారు. యాప్ ద్వారా ఆధార్ నెంబర్‌కు విద్యుత్ సర్వీసును అనుసంధానం చేసుకోవడంతో పాటు విద్యుత్ సంబంధిత సమస్యలను ఫిర్యాదు చేయవచ్చన్నారు. పేటీఎం, ఫోన్ పే, జీపేతో సహా ఇతర యూపీఐ యాప్‌ల ద్వారా బిల్లులు నేరుగా చెల్లించే విషయంపై ఆర్‌బీఐ అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ పాత విధానంలోనే ఫోన్ పే, పేటీఎం, జీ పేలు ద్వారా వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు వీలుగా బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు వెల్ల డించారు. ఏపీఈపీడీసీఎల్ మొబైల్ యాప్‌లో గాని, సంస్థ వెబ్‌సైట్‌లో గాని బిల్లులు చెల్లించే సమయంలో వినియోగదారులు తమ ఫోన్ పే, జీ పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్‌తో పాటు నెట్‌బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్ కార్డులు, వాలెట్స్, క్యాష్ కార్డ్ కూడా వాడుకోవచ్చని సీఎండీ పేర్కొన్నారు.

మంత్రి అనిత దృష్టికి 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమస్యలు


హోం మంత్రికి వినతి పత్రం అందిస్తున్న ఉపాధ్యాయ నాయకులు

అనకాపల్లి టౌన్, జూలై 7 : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 1998 డీఎస్సీ ఉపాధ్యాయుల (ఎంటీఎస్) సంఘం ప్రతినిధులు హోం మంత్రి వంగలపూడి అనితకు వినతి పత్రాన్ని అందజేశారు. ఆదివారం ఇక్కడ ఏర్పాటైన కార్యక్రమానికి విచ్చేసిన ఆమెను కలిసి సమస్యలను వివరించారు. గత ప్రభుత్వం 2023 ఏప్రిల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి, రాష్ట్రంలో 4072 మందిని ఎంటీఎస్ ఉపాధ్యాయులుగా, వయో పరిమితి 60 ఏళ్లుగా నిర్ణయించిందని పేర్కొన్నారు. వయో పరిమితిని 62 ఏళ్లకు పెంచాలని, ఏజెన్సీ ప్రాంతం నుంచి మైదానానికి బదిలీ చేయాలని సంఘ ప్రతినిధులు విన్నవించారు.

పింఛన్ల కోసం అడ్డదారులు

... 3వ పేజీ తరువాయి
, దివ్యాంగ పింఛన్లు 86, ఖండేపల్లిలో 329 పింఛన్లలో 86, లక్కవరం పంచాయతీలో 429 పింఛన్లలో 86, వెంకన్నపాలెం పంచాయతీలో 345 పింఛన్లలో 63 పింఛన్లు దివ్యాంగుల కోటాలోనే ఉన్నాయి. 2019లో మండలంలో 1,234 దివ్యాంగ పింఛన్లు ఉంటే, 2024 సంవత్సరానికి వచ్చేసరికి ఆ సంఖ్య 1,535కి పెరిగిపోయింది. ఇందులో కనీసం 50 శాతానికి పైగా బోగస్ పింఛన్లు ఉండవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా కూటమి ప్రభుత్వం వచ్చాక దివ్యాంగ పింఛన్ నగదు రూ.6 వేలు చేయడంతో మరికొందరు అర్హత లేకున్నా సదరం సర్టిఫికెట్లు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుతం మండలంలో పింఛన్ల పంపిణీకి రూ.5.6 కోట్లు ఖర్చు అవుతోంది. ఇటువంటి పరిస్థితిలో మరికొందరు అడ్డదారిలో సదరం సర్టిఫికెట్లు పొంది దివ్యాంగ పింఛన్లు తీసుకుంటే ప్రభుత్వంపై అదనపు భారం పడుతుంది. ఇప్పటి వరకు జారీ చేసిన సదరం సర్టిఫికెట్లను ప్రత్యేక వైద్య బృందంతో తనిఖీ చేయిస్తే బండారం బయట పడుతుందని స్థానిక నాయకులు అంటున్నారు. దివ్యాంగ పింఛన్లలో వడపోత చేపట్టి అర్హులకు మేలు జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

రహస్య సర్వేపై రగడ

... 3వ పేజీ తరువాయి
అడ్డుకోవడంతో వెనుదిరిగిన సర్వే బృందాలు తాజాగా మళ్లీ వారం రోజుల కింద నుంచి సర్వే చేస్తోంది. రెండు రోజుల కిందట చింతలపూడి, నగరంపాలెం, సరియా, దాయర్తి గ్రామాల్లో సర్వే జరుగుతున్న ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో స్థానికులు వెళ్లి సర్వే చేయవద్దని అడ్డుకున్నారు. సర్వే బృందాలు తమతో తీసుకొచ్చిన సామగ్రిని ఇక్కడ నుంచి తరలించాలని సర్వే సంస్థ ప్రతినిధులతో వాగ్వాదానికి దిగడంతో వారు అక్కడ నుంచి తాత్కాలికంగా వెళ్లిపోయారు. హైడ్రో పవర్ ప్లాంటుకు ఈ ప్రాంతంలో అనుమతి ఇస్తే తమ పంట పొలాలు, అటవీ సంపదను కోల్పోవాల్సి వస్తుందని ఈ ప్రాంత గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ ఈ ప్రాంతానికి సర్వే సంస్థలు వస్తే అడ్డుకుంటామని స్థానికులు హెచ్చరిస్తున్నారు. కాగా దేవరాపల్లి తహసీల్దారు లక్ష్మీనారాయణ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ ఈ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్లాంట్ కోసం సర్వే చేసుకొనేందుకు, వివరాల సేకరణకు ప్రభుత్వం తరఫున ఎవరికీ ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, అసలు సర్వే జరుగుతున్నట్టే తమ దృష్టికి రాలేదని చెబుతున్నారు.

సాగునీటి వనరులు గాడిన పడేనా?

... 3వ పేజీ తరువాయి
పడుతున్నారు. పంట కాలువల్లో తుప్పలు, పూడిక పేరుకుపోవడంతో వరి పంట పొలాలకు సాగునీరు అందకపోవడంతో సాగు పెట్టుబడి రాని పరిస్థితుల్లో అనేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి చెరువుల్లో కనీసం పేరుకుపోయిన తుప్పలు తొలగించలేని పరిస్థితులు మండలంలోని పలు గ్రామాల్లో చోటు చేసుకున్నాయి. ఏటా నిధుల మంజూరుకు గత వైసీపీ ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. కూటమి ప్రభుత్వం రావడంతో ఈ ఏడాదైనా మరమ్మతులు చేపట్టి ఖరీఫ్, రబీ సాగుకు సాగునీరు అందే విధంగా పాలకులు, అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్ మండల జేఈ సూర్యనారాయణను సంప్రతించగా ధారగెడ్డ ఆనకట్ట మరమ్మతులు, పంట కాలువల్లో పూడికతీతకు గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

బాలికను హత్య చేసిన నిందితుడికి కఠిన శిక్ష

▸▸ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం ▸▸ ఎమ్మెల్యే 'సుందరపు' వెల్లడి ▸▸ కొప్పుగొండుపాలెం వెళ్లి మృతురాలి కుటుంబానికి ఓదార్పు

రాంబిల్లి, జూలై 7 : మండలంలోని కొప్పుగొండుపాలెంలో శనివారం సాయంత్రం హత్యకు గురైన బాలిక తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆదివారం కలిసి ఓదార్చారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ గ్రామానికి వెళ్లి జరిగిన ఘటనను తెలుసుకున్నారు. ఎమ్మెల్యేను చూసి వారు కన్నీటిపర్యంతమయ్యారు. రాంబిల్లి హైస్కూల్‌కు వెళ్లి వచ్చిన తమ కుమార్తె ఇంటికి రాగానే ఈ ఘోరం జరుగుతుందని తాము కలలో కూడా ఊహించలేదని విలపించారు. కశింకోటకు చెందిన సురేశ్ గతంలో తమ కుమార్తెను ఇబ్బంది పెడుతుండడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు అరెస్టు చేసి జైలుకు పంపారన్నారు. సుమారు పదిహేను రోజుల క్రితం బెయిల్‌పై వచ్చిన సదరు యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి తమ కుమార్తెను దారుణంగా హత్య చేశాడని వాపోయారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, నిందితుడ్ని ఉరితీయాలని మృతురాలి తల్లిదండ్రులతో పాటు గ్రామస్థులు కోరారు. అనంతరం ఎమ్మెలే విలేకరులతో మాట్లాడుతూ బాలిక హత్యకేసులో నిందితుడ్ని త్వరితగతిన పట్టుకుని చట్టప్రకారం శిక్ష పడేలా చూస్తామన్నారు. ఇప్పటికే పోలీస్ బృందాలు అతడి కోసం గాలిస్తున్నట్టు చెప్పారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వివరించారు. బాలిక కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చిన వారిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దూళి రంగనాయకులు, రాంబిల్లి మండల టీడీపీ అధ్యక్షుడు వి.దిన్‌బాబు, జనసేన అచ్యుతాపురం మండల అధ్యక్షుడు బైలపూడి శ్రీరామదాసు, జనసేన నాయకుడు లాలం చందు, టీడీపీ నాయకుడు గనగళ్ల వివేక్ తదితరులు పాల్గొన్నారు.


కొప్పుగొండుపాలెంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్


ఘటన వివరాలు తెలుసుకుంటున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పరామర్శ

కొప్పుగొండుపాలెంలో హత్యకు గురైన బాలిక కుటుంబాన్ని టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు పరామర్శించారు. జరిగిన ఘటన గురించి తెలుసుకున్నారు. బాధితులకు టీడీపీ అండగా ఉంటుందన్నారు. అనంతరం ఆయన పరవాడ డీఎస్పీ సత్యనారాయణతో మాట్లాడి నిందితుడ్ని త్వరితగతిన పట్టుకుని చట్టప్రకారం శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, బాలికను దారుణంగా హత్యచేసిన నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి, జిల్లా అధ్యక్షురాలు వి.మాణిక్యం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. కొప్పుగొండుపాలెంలో వారు బాలిక కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిందితుడు సురేశ్ ఫోక్సో చట్టం కింద అరెస్టై బెయిల్‌పై వచ్చి బాలికను హతమార్చాడంటే పోలీసులు అప్రమత్తంగా లేకపోవడం వల్లే ఈ ఘటన జరిగిందని ఆరోపించారు. పోలీస్ యంత్రాంగం వెంటనే నిందితుడ్ని పట్టుకుని అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో గంజాయి, మద్యం ఏరులై పారుతుందని, వీటిని కట్టడి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు శివాజీ, వివిధ సంఘాల నాయకులు భూపతి అప్పారావు, మంత్రి నారాయణరావు, కాశియ్య, నూకన్న, బాలజీ, బాబూరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, కొప్పుగొండుపాలెంలో బాలికను అతి కిరాతకంగా హత్య చేసి పరారైన నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని ఐద్వా మండల ప్రతినిధులు లక్ష్మి, దేవి, కాసులమ్మ, మౌనిక తదితరులు డిమాండ్ చేశారు.

మోటూరుపాలెంలో అదుపులో డయేరియా

▸▸ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బాలాజీ

అచ్యుతాపురం, జూలై 7 : దిబ్బపాలెం పంచాయతీ మోటూరుపాలెంలో డయేరియా అదుపులో ఉందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎంఎస్‌వీకే బాలాజీ తెలిపారు. ఆదివారం ఆయన సదరు గ్రామంలో పర్యటించి ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కొత్తగా డయేరియా కేసులు రాలేదన్నారు. విశాఖ కేజీహెచ్, అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆసుపత్రి, అచ్యుతాపురం పీహెచ్‌సీలలో ఉన్న రోగులపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. రెండు రోజుల్లో అంతా పూర్తిగా కోలుకుంటారని వివరించారు. గ్రామంలో మరుగుదొడ్లు లేనివారి వివరాలు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి రజనిని కోరామన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి వ్యక్తిగత మరుగు దొడ్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతామని చెప్పారు.


మోటూరుపాలెంలో పర్యటిస్తున్న డీఎంహెచ్‌వో బాలాజీ

ఆయన వెంటన అచ్యుతాపురం వైద్యాధికారిణి డాక్టర్ కె.శ్రావ్య, డాక్టర్ వెంకటేష్, సీహెచ్‌వో వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

'అంగన్‌వాడీల డిమాండ్స్ డే విజయవంతం చేయండి'


సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

కొత్తూరు, జూలై 7 : అంగన్‌వాడీల సమస్యలపై ఈ నెల పదో తేదీన నిర్వహించనున్న డిమాండ్స్ డేను అంతా విజయవంతం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగశేషు, సీఐటీయూజిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఇక్కడి యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. అఖిల భారత పిలుపు మేరకు ప్రాజెక్టు, మండల కేంద్రాల పరిధిల్లో ధర్నాలు నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సమ్మె కాలంలో ఇచ్చిన హామీల జీవోలు వెంటనే విడుదల చేయాలని, దీర్ఘకాల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తనూజ, వి.వి.రమణమ్మ, జయలక్ష్మి, రమణి, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

'ఉచిత ఇసుక పాలసీ మంచి నిర్ణయం'

పాయకరావుపేట, జూలై 7 : రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని అమల్లోకి తీసుకుని రావడం మంచి నిర్ణయమని, దీని వలన రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణాలు ఉపందుకుని భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లభిస్తుందని పాయకరావుపేట, తుని తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్షుడు, భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర నాయకులు మజ్జూరి నారాయణరావు అన్నారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఇసుకదొరక్క, ఇళ్ల నిర్మాణాలు జరగక భవన నిర్మాణ కార్మికులతో పాటు కార్పెంటర్లు, ఎలక్ట్రికల్ పనులు చేసుకునేవారు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. కొత్తగా ఎన్నికైన కూటమి ప్రభుత్వం కార్మికుల సమస్యలు తెలుసుకుని ఉచిత ఇసుక పాలసీ విధానం అమలులోకి తెస్తుండడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయన సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, హోం మంత్రి వంగలపూడి అనితలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పాలసీని విజయవంతంగా నిర్వహించాలని కోరారు.

ఆకట్టుకున్న భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు


పోటీలో బహుమతులు అందుకున్న చిన్నారులు

అనకాపల్లి టౌన్, జూలై 7 : ఇక్కడి వేల్పుల వీధిలోని దత్త మందిరంలో ఆదివారం భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు ఆకట్టుకున్నాయి. భగవద్గీత శిక్షణాచార్యులు, సాహితీవేత్త కడిమిశెట్టి శ్రీనివాసరావు నేతృత్వంలో మూడు విభాగాలుగా నిర్వహించిన ఈ పోటీలకు యాభై మంది బాల బాలికలు, ముప్పై మంది పెద్దలు హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ు న్యాయ నిర్ణేతలుగా జయకృష్ణమూర్తి, కర్లేపల్లి సుబ్బారావులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎం.రామకృష్ణ, విల్లూరి జయశ్రీమాన్, కొడమంచిలి జగదీశ్వరరావులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం : సీఐ

పరవాడ, జూలై 7 : రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు తగిన జాగ్రత్తలు పాటించాలని సీఐ ఎస్.బాల సూర్యారావు సూచించారు. ఆదివారం ఇక్కడ ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. అతి వేగం, సూచిక బోర్డులను గమనించకపోవడం, మద్యం తాగి వాహనాలు నడపడం కారణంగా ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, వాహనానికి సంబంధించి అన్ని పత్రాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

పరవాడ, జూలై 7 : వాడచీపురుపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. టీడీపీ సీనియర్ నేత మాసవరపు సన్నిబాబు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు ప్రారంభించారు. డాక్టర్ మాసవరపు శ్రీదేవి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలతో పాటు గర్భిణులకు సంబంధించి అన్ని వ్యాధులకు ఉచితంగా చికిత్స అందించి మందులు పంపిణీ చేశారు. సుమారు 50 మంది రక్తదానం చేశారు. సర్పంచ్ శివలంక లక్ష్మి, నాయకులు పైలా సన్యాసిరావు, అట్టా సన్యాసిఅప్పారావు, వియ్యపు చిన్న, కూండ్రపు శ్రీరామ్మూర్తి, ఇందల కొండలరావు, బొండా సన్నిదేముడు, అర్జిల్లి రవి, కూండ్రపు శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

పాల సంఘం అధ్యక్షులు ఎన్నిక


చిన్నినాయుడును అభినందిస్తున్న నాయకులు

ఎలమంచిలి, జూలై 7 : మునిసిపాలిటీలోని కొత్తఎర్రవరం పాల సంఘం అధ్యక్షుడిగా చంద్రగిరి చిన్నినాయుడు ఆదివారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అతనిని మాజీ వైస్ ఎంపీపీ పిట్టా శ్రీనివాస్‌తో పాటు కూటమి నాయకులు నగిరెడ్డి కాసుబాబు, సేనాపతి లచ్చుబాబు తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమానికి కృషిచేస్తానన్నారు. పొలిమేరమ్మ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు గణేష్, శానాపతి ఆనంద్, చంద్రగిరి నానాజీ, చంద్రగిరి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : అమృతపురం పాల సొసైటీ అధ్యక్షుడిగా గండి రమణబాబు ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఆయనను అంతా ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. అనంతరం డైరెక్టర్లు, రైతులు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గండి ముత్యాలనాయుడు తదితరులు ఘనంగా సత్కరించారు.

11న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

సబ్బవరం, జూలై 7 : మండలంలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఈనెల 11వ తేదీన సబ్బవరంలో నిర్వహించనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్బవరం, అంతకాపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని వినియోగదారులు హాజరై విద్యుత్ పరంగా ఎదుర్కొంటున్న సమస్యలను వేదిక దృష్టికి తీసుకు రావాల్సిందిగా ఆయన సూచించారు. విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక ఛైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అధ్యక్షతన ఆరోజు ఉదయం పది గంటలకు ప్రారంభం కానుందని వివరించారు.

నిరుపయోగంగా సచివాలయ భవనం

పరవాడ, జూలై 7 : మండల కేంద్రం పరవాడలోని సంతబయలు వద్ద నిర్మించిన సచివాలయ భవనం నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. ఉపాధి హామీ పథకం నిధులు రూ.35లక్షలు వెచ్చించి ఈ భవనాన్ని నిర్మించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందన్న హడావుడితో అప్పటి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సచివాలయ భవనాన్ని ఆదరాబాదరాగా ప్రారంభోత్సవం చేసి చేతులు దులుపేసుకున్నారు. ఇది జరిగి మూడు నెలలు కావస్తున్నా నిరుపయోగంగా ఉంచడం పట్ల స్థానికులు మండిపడుతున్నారు. ప్రస్తుత పంచాయతీ భవనంలో అరకొర వసతులతో సచివాలయ సిబ్బంది సేవలందిస్తున్నారు. అయినప్పటికీ ఈ భవనాన్ని వినియోగంలోకి తేవడం లేదని అంటున్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం



సబ్బవరం, పాయకరావుపేటలలో వేడుకల దృశ్యం

సబ్బవరం, జూలై 7 : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపన దినోత్సవాన్ని సబ్బవరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామ్రాట్‌కుమార్, నియోజకవర్గం కన్వీనర్ ఇండుగుబల్లి గోపీ, మండల అధ్యక్షుడు బొర్రా జయరాజు హాజరై సాయినగర్ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్టీఆర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. నాయకులు నీటిపల్లి ముత్యాలరావు, దుర్గాలు, సన్యాసిరావు, పరదేశి, కోటి అప్పారావు, గంగరాజు, శాంతికుమారి, చిన్నారావు, కోటి, సంతోష్, మహేష్ పాల్గొన్నారు.

పాయకరావుపేట : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఇక్కడ సమితి నాయకులు ఘనంగా నిర్వహించారు. చిత్రమందిర్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి మందకృష్ణ మాదిగ బర్త్ డే కేక్‌ను కట్‌చేసి ర్యాలీ చేపట్టారు. నియోజకవర్గ ఇన్ చార్జి గంపల చినరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యలకా మల్లిబాబు, ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లి చినఅప్పారావు, ఎమ్మార్పీఎస్ నాయకులు గంపల సుబ్బారావు, కుందూరు కుమార్, సలికే అచ్చిరాజు, వేమగిరి లక్ష్మణ్, రాణా, తమ్మలపల్లి కుమార్, ముంజులూరి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

'మోటారు కార్మికులకు నష్టం కలిగించే చట్టాన్ని రద్దు చేయాలి'



నర్సింగబిల్లిలో నిరసన తెలుపుతున్న మోటారు కార్మికులు

కశింకోట, జూలై 7 : ఆటో, మోటారు కార్మికులకు నష్టం కలిగించే చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ సంఘం నాయకులు శంకర్ డిమాండ్ చేశారు. నర్సింగబిల్లిలో ఆదివారం ఆటో, మోటారు కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు గుదిబండలా తయారు చేసిన కొత్త మోటారు చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలన్నారు. దేశంలో లక్షలాది మంది ట్రాన్స్‌పోర్టు రంగంలో పని చేస్తున్నారని వీరందరికీ కొత్త మోటారు చట్టం వల్ల నష్టం కలుగుతోందన్నారు. జీరో వడ్డీకి బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేసి వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు ఎం.వి.ఎస్. అప్పారావు, రాజు, ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

10న 'పేట' మండల సమావేశం

పాయకరావుపేట, జూలై 7 : పాయకరావుపేట మండల సమావేశం ఈ నెల పదో తేదీన నిర్వహించనున్నామని ఎంపీడీవో కె.స్వప్న తెలిపారు. ఎంపీపీ పార్వతి అధ్యక్షతన ఉదయం పది గంటలకు ప్రారంభం కానుందన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాల్సిందిగా కోరారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

నక్కపల్లి, జూలై 7 : సీజనల్ వ్యాధులపై రమణయ్యపేటలో పాయకరావుపేట నియోజకవర్గం టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు కర్రి ఆంజనేయులు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి ఆవరణను ప్రతీ ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షపు నీరు నిల్వవుంటే తద్వారా కుట్టిన దోమల వల్ల డెంగ్యూ వ్యాధులు ప్రబలుతాయని వివరించారు. పిల్లలకు నిల్వ ఉన్న ఆహారపదార్థాలు పెట్టకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కసిరెడ్డి ఆదినారాయణ, కసిరెడ్డి రాజు, కర్రి బాలాజీ, బలం శివకృష్ణ, కంఠం సోమన్నదొర, కర్రి లోవరాజు, కర్రి శ్రీనివాసరావు, వంగలపూడి శ్రీను, రాజులు, కృష్ణ, లోవరాజు పాల్గొన్నారు.


వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఆంజనేయులు

'జగనన్న కాలనీల్లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి'

కొత్తూరు, జూలై 7 : అనకాపల్లి మండలంలోని మేజర్ పంచాయతీ కొత్తూరు, సత్యనారాయణపురం, సంపతిపురం పరిధిలోని జగనన్న లే అవుట్‌లలో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరిగాయని కూటమి నాయకులు జ్యోతుల గణేష్, మేడిశెట్టి సత్తిబాబు, కోన శ్రీనివాసరావు ఆరోపించారు. ఆదివారం వారంతా కొత్తూరు, తుమ్మపాల తదితర ప్రాంతాల్లోని జగనన్న కాలనీల్లో నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అనకాపల్లి మండలంలోని ఉన్న పలు జగనన్న కాలనీల్లో అక్రమాలు జరిగాయన్నారు. ప్రధానంగా కొత్తూరు, సత్యనారాయణపురం, సంపతిపురం, పిసినికాడ పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమాలకు హద్దే లేకుండా పోయిందన్నారు. ఈ సమస్యలన్నీ గుర్తించి పూర్తి వివరాలతో ప్రభుత్వానికి, స్థానిక ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు ఫిర్యాదు చేస్తామన్నారు. సంపతిపురం పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 2/2లో 303 మందికి ప్లాట్లు కేటాయించారన్నారు. అయితే ఇక్కడ మరో 84 నకిలీ పట్టాలను స్థానిక వైసీపీ నాయకులు చేయించారన్నారు. నకిలీ పట్టాలపై ఉన్నత స్థాయి అధికారులతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే సత్యనారాయణపురం పంచాయతీ పరిధిలో సుమారు 90 వరకూ బోగస్ పట్టాలు సృష్టించి అమ్మకాలు చేశారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చి పట్టాలన్నీ వారి పార్టీకి చెందిన వారికే ఇచ్చారన్నారు. కొత్తూరుకు చెందిన వైసీపీ చోటా నాయకుడు నిర్మాణ సమయంలో టోల్ గేట్లు కూడా ఏర్పాటు చేసి అదనపు ధరలకు నిర్మాణ సామగ్రి విక్రయించడమే కాకుండా పట్టాలు అమ్ముకొని రూ.కోట్లు గడించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మేడిశెట్టి నూకరాజు, పందల సత్య గోవింద్, నీటిపల్లి రాజు, బర్ల నాగరాజు, వేపాడ సత్తిబాబు, వేజర్ల వర్మ, మద్దాల సుబ్రహ్మణ్యం, కారుచిన్న అడివిరాజు, మోసూరి నర్సింగ్, ఐతా లక్ష్మణరావు, రామ్ ప్రవీణ్, ప్రశాంత, లక్ష్మణ్, సతీష్, వాసు పాల్గొన్నారు.


సంపతిపురం జగనన్న లే అవుట్‌లో ఆందోళన చేస్తున్న కూటమి నేతలు

రామన్నపాలెం సర్పంచ్ ధర్మిరెడ్డి నాయుడుబాబుకు పితృ వియోగం


మృతదేహం వద్ద ప్రగడ నివాళి (ఇన్‌సెట్) నానిబాబు ఫైల్

అచ్యుతాపురం/ రూరల్, జూలై 7 : తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రామన్నపాలెం సర్పంచ్ ధర్మిరెడ్డి నాయుడు బాబు (డ్రీమ్స్ నాయుడు) తండ్రి నానిబాబు (70) అకస్మాత్తుగా మృతిచెందారు. ఆదివారం పొలానికి వెళ్లిన ఆయన అక్కడే కన్నుమూశారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, అచ్యుతాపురం మండలం టీడీపీ అధ్యక్షుడు జనపరెడ్డి శ్రీనివాసరావుతో పాటు మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అభిమానులు రామన్నపాలెంలోని డ్రీమ్స్‌నాయుడు స్వగృహానికి చేరుకుని సంతాపం తెలిపారు. సోమవారం దహన సంస్కారాలు నిర్వహించాలని నిర్ణయించారు.

కోలాహలంగా జగన్నాథ రథోత్సవం

» దశావతారాల దర్శనాలు ప్రారంభం



రథోత్సవం పాల్గొన్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, జూలై 7 : పట్టణంలోని జగన్నాథుని రథోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైంది. రథోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శన సీతారామాచార్యుల ఆధ్వర్యంలో జగన్నాథుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం పట్టణంలో స్వామి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు స్వామిరథం లాగి ఉత్సవాలను ప్రారంభించారు. రథోత్సవంలో మహిళలు, చిన్నారుల కోలాటాలు, కీర్తనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో గోవాడ షుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు, నాయకులు సకురు కోటేశ్వరరావు, సేనాపతి శ్రీనివాసరావు, ఎంపీటీసీ నాయుడు, స్థానిక పెద్దలు ఉప్పలబాబు, ఉపాధ్యాయుల శ్రీనివాస్, పనసారెడ్డి సీఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

మాకవరపాలెం, జూలై 7 : టీడీపీ ఫ్లెక్సీలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఫోటోలుఅతికించిన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని ఆదివారం టీడీపీ నాయకులు ఎస్ఐ రామ కృష్ణారావుకుఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో వజ్రగడలో ఇటీవల పింఛన్ల పంపిణీ చేపట్టిన రోజు క్షీరాభిషేకం నిర్వహించేందుకు రామాలయం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు, స్వర్గీయ నందమూరి తారకరామారావు, శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు చిత్రపటాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అయితే శనివారం అర్ధరాత్రి ఈ టీడీపీ ఫ్లెక్సీల్లో ఉన్న ముగ్గురు నాయకుల ఫోటోల ముఖాలపై సిద్ధ అంటూ మాజీ ముఖ్యమంత్రి ఫోటోలను కొందరు వైసీపీ నేతలు అతికించారు. దీనిపై ఆదివారం టీడీపీ గ్రామ అధ్యక్షుడు వంటాకుల మధు మల్లేశ్వరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అలాగే ఇటీవల రామన్నపాలెంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే వైసీపీ నాయకులు చించివేశారన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు అల్లు రాము నాయుడు, మాజీ జడ్పీటీసీ రుత్తల శేషకుమార్, మాకవరపాలెం ఉప సర్పంచ్ లాలం రాము, టీడీపీ మండల యూత్ ఉపాధ్యక్షుడు గిరిబాబు, ఐ టీడీపీ సోషల్ మీడియా కార్యదర్శి పైల విక్రమ్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు అప్పలనాయుడు, శ్రీను పాల్గొన్నారు.

రంగా ఆశయ సాధనకు కృషి చేయాలి

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు



రక్తదాన శిబిరంలో పాల్గొన్న తాతయ్యబాబు

చోడవరం, జూలై 7 : వంగవీటి రంగా ఆశయాల సాధన కోసం యువకులు కృషి చేయాలని జిల్లా టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు తెలిపారు. రంగా జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక తూర్పు కాపు యువజన సంఘం కాపురాక్స్ ఆధ్వర్యంలో ప్రేమసమాజం ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని తాతయ్యబాబు ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ.. రంగా జయంతి సందర్భంగా యువత సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మజ్జి గౌరీశంకర్, జిల్లా తెలుగుయువత నాయకుడు సిరిగిరిశెట్టి శ్రీరాం, సకురు కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు జగత శ్రీనివాసరావు, కాపునాడు జిల్లా అధ్యక్షులు వెలుగుల అర్జునరావు, కాపు యువజన సంఘం కాపు రాక్స్ ప్రతినిధులు ఆకుల రమేష్ పాల్గొన్నారు.

జగన్నాథస్వామి ఉత్సవాలు ప్రారంభం



జగన్నాథ స్వామి, బలభద్ర, సుభద్రలకు పూజలు

మాడుగుల, జూలై 7 : మాడుగులలో జగన్నాథస్వామి రథోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జగన్నాథ స్వామి ఆలయ అర్చకులు పండా నూకరాజు ఆధ్వర్యంలో స్వామి వారికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 4గంటలకు జగన్నాథ స్వామి ఆలయం నుంచి ఇంద్రజుమ్మంకు రథయాత్ర నిర్వహించారు.ఈ నెల 17 వరకూ ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, రోజుకో అవతారంలో స్వామివారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారని పండా తెలిపారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కార్యకర్తలు

చీడికాడ, జూలై 7 : మండల కేంద్రం చీడికాడలో ఆదివారం ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మందకృష మాదిగ 30 ఏళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మార్పీఎస్‌ను స్థాపించి రాష్ట్రంలో మాదిగల సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా చీడికాడలో అరుందతి సేవా సంఘం, మహాజన సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, చీడికాడ ఎంపీటీసీ రావాడ మణి, వివిధ సంఘాల నాయకులు రావాడ దేముడు, కొండమ్మ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో 'అమూల్' సేవలా?

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



వజ్రగడలోని సచివాలయం



అమూల్ పాల కేంద్రం వస్తుసామగ్రి

మాకవరపాలెం, జూలై 7 : గత ప్రభుత్వంలో అమలు చేసిన అమూల్ సేవలు గ్రామ సచివాలయంలో నిర్వహించడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు అమూల్య సేవలు అందించాల్సినఉండగా, ఇక్కడ అధికారులు 'అమూల్ సేవలో' తరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.మండలంలోని వజ్రగడలో అమూల్ సేవలు గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్నారు. అయితే అప్పటి ప్రభుత్వం అమూల్ పాలకేంద్రాలను మండలంలో ఎంపిక చేసింది. ఈ పాలకేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహించాల్సి ఉంది. అయితే గత ప్రభుత్వంలో అప్పటి ఎంపీడీవో నేరుగా సచివాలయంలో అమూల్ సెంటరు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం మారడంతో టీడీపీ స్థానిక సీనియర్ నాయకులు తమరాన అప్పలనాయుడు సచివాలయంలో అమూల్ సెంటరు తొలగించాలని ఇటీవల ఎంపీడీవో చంద్రరావుకు ఫిర్యాదు చేశారు. అయితే ఫిర్యాదు చేసి పది రోజులు గడుస్తున్నా దీనిపై అధికారులు మాత్రం నేటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అమూల్ పాలకేంద్రాన్ని సచివాలయ భవనం నుంచి తొలగించాలని వారు కోరుతున్నారు.

నకిలీ ధ్రువపత్రాలతో పింఛన్లపై విచారణ చేపట్టాలి

సీఐటీయూ మండల కార్యదర్శి రొంగలి



చీడికాడ, జూలై 7 : నకిలీ సదరం ధ్రువపత్రాలతో దివ్యాంగ పింఛన్లు పొందిన విషయమై విచారణ చేపట్టి అటువంటి వారిపై చర్యలు తీసుకోవా లని సీఐటీయూ మండల కార్యదర్శి రొంగలి దేముడునాయుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. నకిలీ వ్యక్తులకు రాష్ట్ర వ్యాప్తంగా 2.50లక్షలు అందుతున్నాయంటూ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాం గులు, రోగులకు పింఛన్లు ఇవ్వడం అభినందనీ యమే అన్నారు. అయితే పింఛన్లు అర్హులకు మాత్రమే అందాలన్నారు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి

» తైక్వాండో క్రీడాకారులకు ఎమ్మెల్యే రాజు అభినందనలు



జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, జూలై 7 : జాతీయ స్థాయి క్రీడల్లో సత్తా చాటి జిల్లాకు పేరుతేవాలని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు క్రీడాకారులను కోరారు. రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు సత్తాచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అనకాపల్లి జిల్లాకు చెందిన శరి వర్ధన్‌కుమార్, గండి కారుణ్య, పడాల తరుణ్, హేమశ్రీ, ఇషిత, శారద, జాన్, రోజీలీ, రిషితాంజలి, సుజిత, విజయ్‌లు రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణ, రజత పతకాలు సాధించారు. వీరంతా ఆగస్టు నెలలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననున్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లం మురళీకృష్ణ, దండా గోవింద్, చవల చంద్రశేఖర్, కోచ్‌లు కె.ప్రదీప్‌కుమార్, సింహాచలం. సంతోషి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాన్ని తరలించాలి : ఐద్వా



మురికి కూపాల వద్ద నిరసన తెలుపుతున్న ఐద్వా ప్రతినిధులు

నర్సీపట్నం, జూలై 7 : పట్టణంలోని 28వ వార్డు పరిధి సీబీఎం కాంపౌండ్ సమీపంలో నివాస ప్రాంతాల మధ్య ఉన్న నర్సింగ్ కళాశాల, వసతిగృహం కారణంగా డ్రైనేజీ నీరు రోడ్డు మీద నిలిచిపోతోందని ఐద్వా ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. పారిశుధ్య సమస్య తలెత్తుతోందని, వసతి గృహాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. వసతి గృహం వద్ద డ్రైనేజీ సౌకర్యం లేక సుమారు 400 మంది విద్యార్థులు వాడే నీరు రోడ్డు మీద నిలిచిపోవడంతో రాకపోకలకు, స్థానికులు ఇబ్బంది ఎదురవుతోందన్నారు. దోమల బెడద పెరిగి జ్వరాల బారిన పడుతున్నారని తెలిపారు. మునిసిపల్ అధికారులు తక్షణ చర్యలు తీసుకొని డ్రైనేజీ నిర్మాణం జరిగే వరకు వసతి గృహాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో సమస్య పరిష్కారం చేయకుంటే వసతిగృహానికి తాళం వేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు కేవీ సూర్య ప్రభ, గౌరీ, బీఎస్పీ నాయకుడు నాగరాజు, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

తట్టబందలో శుభ్రత చర్యలు



రావికమతం, జూలై 7 : ఈ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా తట్టబంద సర్పంచ్ గోకివాడ రమణ ఆధ్వర్యంలో గ్రామంలో చర్యలు చేపట్టారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండంతో గ్రామంలో డయేరియా, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా గత వారం రోజులుగా పంచాయతీ పరిధిలో శివారు గ్రామాలతో పాటు పంచాయతీ కేంద్రంలో డ్రైనేజీలలో పూడిక తీత, రోడ్లకు ఇరువైపులా పేరుకు పోయిన తుప్పల తొలగింపు చేపట్టారు. అలాగే ఆదివారం రోడ్లు, డ్రైనేజీల్లో ఇరువైపులా బ్లీచింగ్ చల్లించారు. తాగునీటి వనరులలో క్లోరినేషన్ చేయించారు. పరిశుభ్రతకు చిరునామాగా గ్రామాన్ని శుభ్రపరుస్తున్నారు.

నారుమళ్ల పనిలో రైతులు బిజీబిజీ



విత్తనాలు వేసే పనిలో నిమగ్నమైన రైతులు

గొలుగొండ, జూలై 7 : మండలంలో పలు గ్రామాల్లో వరి విత్తనాలు చల్లే పనిలో రైతులు బిజీగా ఉన్నారు. మండలంలోని వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నేల పదును మారడంతో పాతమల్లంపేట, పాకలపాడు, ఏటిగైరంపేట, గొలుగొండ, పప్పుశెట్టిపాలెం, జోగంపేట గ్రామాల్లో వరి విత్తనాలు చల్లే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ప్రస్తుతం పలుగ్రామాల్లో గల చెరువులు వర్షాలకు నిండాయి.

సాగు రిజిస్టర్‌లో రైతుల పేర్లను పునరుద్ధరించాలి

» జనసేన పార్టీ నేత పీవీఎస్ఎన్ రాజు



పీవీఎస్‌రాజుకు వినతిపత్రం అందిస్తున్న ఆదివాసీలు

రోలుగుంట, జూలై 7 : ఏళ్ల తరబడి ఆదివాసీలుసాగు చేస్తున్న భూములకు ఆదివాసీలకే హక్కులకు కల్పించాలని, సాగు రిజిస్టర్‌లో తొలగించిన పేర్లను యథావిధిగా పునరుద్ధరించాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఎంకేపట్నంలో పంచాయతీ శివారు చటర్జీపురంలో పర్యటించి ఏళ్ల నుంచి ఆదివాసీలు ఎదుర్కొంటున్న భూసమస్యలను తెలుసుకున్నారు. సర్వే నెంబరు 139లో 10 ఎకరాల భూమిలో స్థానిక ఐదు ఆదివాసీ కుటుంబాలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు.

గత వైసీపీ ప్రభుత్వం హయాంలో అప్పటి తహసీల్దార్ కొంత మంది వైసీపీ నాయకులతో కుమ్మక్కై రికార్డులను తారుమారు చేసి వెబ్‌ల్యాండ్‌లో సాగు అనుభవం నుంచి తొలగించారని ఆరోపించారు. అప్పటి నుంచి వీరు ఎన్ని సార్లు రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. ఈ భూవ్యవహారంపై తగిన విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షుడు మహారాజు, నాయకులు శివాజీ అప్పారావు, త్రినాథ్, సోమాలనాయుడు, జగ్గునాయుడు, రామకృష్ణ పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూలు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



బుచ్చెయ్యపేట, జూలై 7 : వడ్డాది జడ్పీ హైస్కూలులో 1998-99వ విద్యా సంవత్సరంలో విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. వీరంతా 25 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. భావోద్వేగాలకు లోనై ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. విందు, వినోదాలతో సాయంత్రం వరకు సందడిగా గడిపారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఉద్యోగ, ఉపాధి నిమిత్తం ఎక్కడెక్కడో స్థిరపడిన 100 మంది విద్యార్థులు సమ్మేళనంలో పాల్గొన్నారు. కుటుంబసభ్యులను పరిచయం చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి గౌరవించారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సమ్మేళనంలో దొండా నరేష్, అదత్రావు తమ్మన్నదొర, పాచిల నాగేష్, రమేసు, నాయుడు పాల్గొన్నారు.

జగన్నాథస్వామి ఆలయానికి నూతన కమిటీ



ఎన్నికైన ఆలయ కమిటీ ప్రతినిధులు

మాడుగుల, జూలై 7 : మాడుగుల జగన్నాథస్వామి ఆలయ నూతన కమిటీ సభ్యులుగా ఆదివారం టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన కూటమి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షులు రంజిత్‌వర్మ మాట్లాడుతూ మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి ఆదేశానుసారంగా జగన్నాథస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా బొడ్డేటి ఆదినారాయణ, ఎనిమిది మంది సభ్యులుగా పి.రామ మహేష్, దాడి జగన్నాథరావు, పి.కాసులనాయుడు, జె.రమేష్, పల్లేల రాము, కె.జగన్నాథరావు, వి.రఘూన్సీ పి.సత్తిబాబులను ఎన్నుకున్నట్టు తెలిపారు. కూటమి పార్టీలకు చెందిన నాయకుల ఏకాభిప్రాయంతో నూతన కమిటీగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తారని అన్నారు.

సాగునీటి వనరులు గాడిన పడేనా?

... 3వ పేజీ తరువాయి

పడుతున్నారు. పంట కాలువల్లో తుప్పలు, పూడిక పేరుకుపోవడంతో వరి పంట పొలాలకు సాగునీరు అందకపోవడంతో సాగు పెట్టుబడి రాని పరిస్థితుల్లో అనేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి చెరువుల్లో కనీసం పేరుకుపోయిన తుప్పలు తొలగించలేని పరిస్థితులు మండలంలోని పలు గ్రామాల్లో చోటు చేసుకున్నాయి. ఏటా నిధుల మంజూరుకు గత వైసీపీ ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. కూటమి ప్రభుత్వం రావడంతో ఈ ఏడాదైనా మరమ్మతులు చేపట్టి ఖరీఫ్, రబీ సాగుకు సాగునీరు అందే విధంగా పాలకులు, అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్ మండల జేఈ సూర్యనారాయణను సంప్రతించగా ధారగెడ్డ ఆనకట్ట మరమ్మతులు, పంట కాలువల్లో పూడికతీతకు గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

పింఛన్ల కోసం అడ్డదారులు

... 3వ పేజీ తరువాయి

, దివ్యాంగ పింఛన్లు 86, ఖండేపల్లిలో 329 పింఛన్లలో 86, లక్కవరం పంచాయతీలో 429 పింఛన్లలో 86, వెంకన్నపాలెం పంచాయతీలో 345 పింఛన్లలో 63 పింఛన్లు దివ్యాంగుల కోటాలోనే ఉన్నాయి. 2019లో మండలంలో 1,234 దివ్యాంగ పింఛన్లు ఉంటే, 2024 సంవత్సరానికి వచ్చేసరికి ఆ సంఖ్య 1,535కి పెరిగిపోయింది. ఇందులో కనీసం 50 శాతానికి పైగా బోగస్ పింఛన్లు ఉండవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కాగా కూటమి ప్రభుత్వం వచ్చాక దివ్యాంగ పింఛన్ నగదు రూ.6 వేలు చేయడంతో మరికొందరు అర్హత లేకున్నా సదరం సర్టిఫికెట్లు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుతం మండలంలో పింఛన్ల పంపిణీకి రూ.5.6 కోట్లు ఖర్చు అవుతోంది. ఇటువంటి పరిస్థితిలో మరికొందరు అడ్డదారిలో సదరం సర్టిఫికెట్లు పొంది దివ్యాంగ పింఛన్లు తీసుకుంటే ప్రభుత్వంపై అదనపు భారం పడుతుంది. ఇప్పటి వరకు జారీ చేసిన సదరం సర్టిఫికెట్లను ప్రత్యేక వైద్య బృందంతో తనిఖీ చేయిస్తే బండారం బయటపడుతుందని స్థానిక నాయకులు అంటున్నారు. దివ్యాంగ పింఛన్లలో వడపోత చేపట్టి అర్హులకు మేలు జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

రహస్య సర్వేపై రగడ

... 3వ పేజీ తరువాయి

అడ్డుకోవడంతో వెనుదిరిగిన సర్వే బృందాలు తాజాగా మళ్లీ వారం రోజుల కింద నుంచి సర్వే చేస్తోంది. రెండు రోజుల కిందట చింతలపూడి, నగరంపాలెం, సరియా, దాయర్తి గ్రామాల్లో సర్వే జరుగుతున్న ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో స్థానికులు వెళ్లి సర్వే చేయవద్దని అడ్డుకున్నారు. సర్వే బృందాలు తమతో తీసుకొచ్చిన సామగ్రిని ఇక్కడ నుంచి తరలించాలని సర్వే సంస్థ ప్రతినిధులతో వాగ్వాదానికి దిగడంతో వారు అక్కడ నుంచి తాత్కాలికంగా వెళ్లిపోయారు. హైడ్రో పవర్ ప్లాంటుకు ఈ ప్రాంతంలో అనుమతి ఇస్తే తమ పంట పొలాలు, అటవీ సంపదను కోల్పోవాల్సి వస్తుందని ఈ ప్రాంత గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ ఈ ప్రాంతానికి సర్వే సంస్థలు వస్తే అడ్డుకుంటామని స్థానికులు హెచ్చరిస్తున్నారు. కాగా దేవరాపల్లి తహసీల్దారు లక్ష్మీనారాయణ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ ఈ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్లాంట్ కోసం సర్వే చేసుకొనేందుకు, వివరాల సేకరణకు ప్రభుత్వం తరఫున ఎవరికీ ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, అసలు సర్వే జరుగుతున్నట్టే తమ దృష్టికి రాలేదని చెబుతున్నారు.

☛ సంక్షిప్తంగా..

మోదకొండమ్మ ఆలయానికి రూ.లక్ష విరాళం



ఆలయ చైర్మన్‌కు విరాళం అందజేస్తున్న జయలక్ష్మి

మాడుగుల, జూలై 7 : మాడుగుల మోదకొండమ్మ అమ్మవారికి గ్రామానికి చెందిన బొమ్మిశెట్టి జయలక్ష్మి రూ.లక్ష విరాళాన్ని అందించారు. ఆదివారం ఆమె తన కుమారుడు శ్రీను, బంధువులు బుచ్చిబాబుతో కలిసి ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజుకు లక్ష రూపాయల విరాళం అందజేశారు. వారికి ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యులు శ్రీనాథు శ్రీనివాసరావు, దంగేటి సూర్యారావు తదితరులు అమ్మవారి మెమొంటోతో సత్కరించారు.

అమ్మవారి ఆలయంలో ఆదివారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికశాతం భక్తులు అమ్మవారి ఘటాల పండగ నిర్వహించుకొని అమ్మవారికి సమర్పించారు. ఆలయా నికి వచ్చిన భక్తుల సౌకర్యార్థం కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేయగా స్థానిక న్యాయవాదులు శ్రీనాథు ప్రసాదరావు, ప్రమోద్‌లు అన్నసమారాధన నిర్వహించారు.

నవోదయకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక



లెక్కల భారతి



కర్రి జ్ఞానేశ్వరి



కసిరెడ్డి షణ్ముఖ్

బుచ్చెయ్యపేట, జూలై 7 : నవోదయకు ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్టు పీఎంఎస్ హైస్కూలు ప్రిన్సిపాల్ పి.ఎం.ఎస్ రమణ తెలిపారు. తమ స్కూలులో కోచింగ్ తీసుకున్న వారిలో మొదటి జాబితాలో ఐదుగురు ఎంపిక కాగా, రెండో జాబితాలో లెక్కల భారతి (దేవరాపల్లి), కర్రి జ్ఞానేశ్వరి (వడ్డాది), కసిరెడ్డి షణ్ముఖ్ (లాలం కోడూరు)కి చెందిన విద్యార్థులు ఎంపికైనట్టు రమణ తెలిపారు

వైఎస్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బుగత, కాంగ్రెస్ ఇతర నేతలు

చోడవరం, జూలై 7 : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను ఈ నెల 8 సోమవారం విజయవాడలో నిర్వహిస్తున్నట్టు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగత శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన పట్టణంలోని ప్రేమసమాజం ఆవరణలో గాంధీవిగ్రహం ఎదుట వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగత మాట్లాడుతూ పేదల పక్షపాతిగా రాష్ట్ర చరిత్రలో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ, రమణాజీ, మణికంఠ, పల్లా ప్రసాద్ పాల్గొన్నారు.

యువత శ్రమదానం



అప్రోచ్ రోడ్డు వేస్తున్న యువకులు

దేవరాపల్లి, జూలై 7 : మండలంలోని కలిగొట్ల నుంచి వేచలంకు వెళ్లడానికి శారదా నదిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టినప్పటికీ అప్రోచ్ రోడ్డు వేయలేదు. దీంతో ఇటుగా రాకపోకలు సాగించే వారు ఇబ్బందులకు గురయ్యేవారు. ఈ నేపథ్యంలో యువకులు శ్రమదానంతో గ్రావెల్ వేసి సదును చేశారు. క్రషర్ బుగ్గి వేయడానికి యువకుంతా నడుం బిగించారు. గొర్రు పోటు రామ్మూర్తినాయుడు, గుల్లిపల్లి, రమేషు, రాజేషు, వాసు నరసింహనాయుడు, దేమున్నాయుడు సహకారం అందించారు.

60 మందికి వైద్య పరీక్షలు



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

కె.కోటపాడు, జూలై 7 : మండలంలోని ఏ.కోడూరు జిల్లా పరిషత్ హైస్కూలులో ఆదివారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 60 మంది రోగులను పరీక్షలు చేయగా, 25 మందికి శస్త్రచికిత్సలు అవసరమని తేల్చారు. కంటి నరాలు చికిత్స కోసం రెండు, కంటి పై పొర చికిత్స కోసం రెండు, కంటి నీటి కాసుల చికిత్స కోసం ఒకటి, కంటి రెప్పల చికిత్స కోసం రెండు, చిన్నపిల్లల కంటి చికిత్స కోసం రెండు, వీరందరినీ విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో చికిత్స చేసేందుకు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ ఆఫీసర్ హరిచందన, శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో-ఆర్డినేటర్ సీహెచ్ అశ్వినికుమార్, నర్సింగ్ స్టాఫ్ వందన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.